# శివరాత్రికి రండి

## సీఎం, మంత్రులకు విప్ ఆది ఆహ్వానం



**ప్రజానావ, వేములవాడ:** ఈ నెల 25 నుంచి 27 వరకు వేములవాడలో ఎంతో వైభవోపేతంగా జరుగనున్న శివరాత్రి ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి సలహదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆహ్వాన పత్రిక అందజేశారు. మంగళవారం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆలయ అర్చకులు సీఎంకు రాజన్న ప్రసాదం అందజేశారు.

### ఆలయ విస్తరణ పనులపై సీఎం ఆరా

ప్రభుత్వం చేపడుతున్న రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీయగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో లాగా పనుల్లో జాప్యం చేయకుండా ఆలయం విస్తరణ పనులను వేగవంతం చేయాలని, రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేములవాడ ప్రజలు రాజన్న భక్తులు ఎంత కాలం నుంచి ఎదురు చూస్తున్నా రోడ్డు వెడల్పుకు సంబంధించి భూ సేకరణ కోసం నిధులు విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.

### మహాశివరాత్రికి ఘనంగా ఏర్పాట్లు చేయాలి

మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. భక్తులకు శీఘ్ర దర్శనం, క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తాగునీటి వసతి, చలువ పందిళ్ళు తదితర ఏర్పాట్లు ముమ్మరం చేసి రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పించి మహాశివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో ఈవో కే వినోద్, ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అర్చకులు చంద్రగిరి శరత్, గోపన్న గారి చందు, మామిడిపల్లి శరత్, వెంకన్న తదితరులు ఉన్నారు.

# ఆశ్రమ పాఠశాలకు డీఎంహెచ్ఓ



**ప్రజానావ, ఏటూరునాగారం:** ములుగు జిల్లా పేరూరు పీహెచ్‌సీతో పాటు ఆశ్రమ పాఠశాలను జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. గోపాలరావు మంగళవారం సందర్శించారు. ఇటీవల సోయం వినీత్ మృతి చెందడంపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఏహెచ్ఎస్ పాఠశాలలో పిల్లల సిక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. పిల్లలకు ఏ వ్యాధులు వస్తున్నాయి.. వాటికి ఎలాంటి మందులు ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అలాగే రిఫరల్ సేవలపై ఆరా తీశారు. అనంతరం హాస్టల్‌లో వంటశాల, విద్యార్థులు నిద్రిస్తున్న గదులను పరిశీలించారు. అంతకుముందు పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు జాతీయ కార్యక్రమాల మీద సమీక్షించారు. దోమల భారీ నుంచి రక్షించుకునేందుకు దోమ తెరలు వాడాలని కిటికీలకు జాలీలు వాడాలని సూచించారు. పదో తరగతి చదువుతున్న పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం సోయం వినీత్ ఇంటికి వెళ్లి మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ములుగు ప్రోగ్రాం ఆఫీసర్ డా.చంద్రకాంత్ , పీవో ఎంసీవీబీడీసీ, టీబీ, డాక్టర్ యోషిత , హెచ్ఈ ఓ వేణుగోపాలకృష్ణ , పీహెచ్ ఎన్ సంగీత, స్టాఫ్ నర్స్ అనూష, నారాయణ, హాస్టల్ వార్డెన్ శ్రీను , నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# కెపాసిటర్లు అమర్చుకోవాలి

### భూపాలపల్లి డీఈఈ వెంకటేశం

**ప్రజానావ, వెంకటాపూర్(రామప్ప):** పంటలు పండించే రైతులు మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని భూపాలపల్లి డీఈఈ వెంకటేశం అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ వెంకటేశం మాట్లాడుతూ రైతులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సూచనలు చేశారు. రేయ్ దుర్గాసిటర్లు అమర్చుకోవడం వలన ఎక్కువ కాలం పాడవకుండా ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ వోల్టేజ్ హెచ్చుతగ్గులను నివారిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు ఏడీఈ వేణుగోపాల్, వెంకటాపూర్ ఏఈ రమేశ్, ఏఎల్ఎం లు కృష్ణాకర్, రమేశ్, సురేశ్ రైతులు పాల్గొన్నారు..



# పాఠశాలను తనిఖీ చేసిన తహసిల్దార్

### పాఠశాల నిర్వహణపై అసంతృప్తి

### ప్రధానోపాధ్యాయుడి పై ఉన్నతాధికారులకు పిర్యాదు

**ప్రజానావ, వెంకటాపూర్(రామప్ప):** మండలంలోని పాపయ్యపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం వెంకటాపూర్ తహసీల్దార్ గిరిబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ పై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్యాం ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా స్టాక్ రిజిస్టర్ నెల రోజుల నుంచి అప్ డేట్ చేయలేదని పేర్కొన్నారు. రోజు వారీ మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, భోజనంలోకి వారానికి మూడు రోజులు గుడ్లు పెట్టాల్సి ఉంటే ఒక్కరోజు మాత్రమే గుడ్డు పెడుతున్నారని అన్నారు. రిజిస్టర్ లోని విద్యార్థుల హాజరు పట్టిక సరిగ్గా నమోదు చేయడం లేదని, పాఠశాలలో మూత్రశాలలు సైతం పరిశుభ్రంగా ఉంచడం లేదని తెలిపారు. ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపడం జరిగిందని తహసీల్దార్ పేర్కొన్నారు.

# ఘనంగా పుట్టినరోజు వేడుకలు




**ప్రజానావ, కరీంనగర్:** బీజేపీ జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ పసుపులేటి శివానంద్ పుట్టినరోజు వేడుకలను మాసం గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర హెూం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆశీర్వాదంతో బైపాస్‌లోని వీర బ్రహ్మేంద్ర అనాథ ఆశ్రమంలో సుమారు 70 మందికి అన్న ప్రసాదం, పండ్లు పంపిణీ చేశారు. భవిష్యత్తులో ఇలా ఎన్నో సేవ కార్యక్రమాలు చేయాలని పసుపులేటి మిత్ర మండలి ఆకాంక్షించింది.

# బీమా చెక్కు అందజేత




**ప్రజానావ, ములుగు:** ములుగు మండలం దేవగిరిపట్నానికి చెందిన తేజవత్ ద్వాలి కుమారుడు ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. తపాలా బ్యాంకు ద్వారా ప్రమాద బీమా తీసుకోవడంతో బాధిత కుటుంబానికి తపాల శాఖ ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజరు ధనుగూరి ప్రమోద్, సబ్ డివిజనల్ హెడ్ దయానంద్ రూ.10లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ ఎగ్జిక్యూటీవ్ లింగమూర్తి, గ్రామీణ ప్రజలకు పాటల ద్వారా సవిరంగా తపాలా బీమాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి నిరంజన్ రెడ్డి, ఈడీఎంసీ అంకూస్, మెయిల్ ఓవర్ అశోక్, పోస్ట్ మాస్టర్లు ప్రదీప్, సురేందర్, రాజశేఖర్, సుప్రిక, గ్రామ ప్రజలు పాల్గొ న్నారు.

# బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

### బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు

**ప్రజానావ, బెజ్జంకి:** పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఓట్లలో బీజేపీ అభ్యర్థులని గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ పట్టభద్రుల,టీచర్ల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా చిన్నమయిల్ అంజిరెడ్డి, మల్కా కొమురయ్యలను గెలిపించాలని పట్టభద్రుల, టీచర్లను కోరారు.మండలంలోని వీరపూర్, బేగంపేట, బెజ్జంకి మండల కేంద్రంలో ఓటర్ల ను కలిసి ఓటు అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మానకొండూర్ నియోజకవర్గం టీచర్ ఎమ్మెల్సీ ప్రబారి గుర్రాల వెంకట్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ మానకొండూరు నియోజకవర్గం ప్రబారి ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతి నెల నిరుద్యోగ భృతి కింద రూ.4వేలు ఇస్తానని నిరుద్యోగుల ఓట్లు దండుకొని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టభద్రుల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులు–టీచర్ల సమస్యలపై నిత్యం కొట్లాడే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులైన అంజిరెడ్డి–కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మండల ఇన్‌చార్జీలు సాన వేణు, దారం సత్తిరెడ్డి, మండల సీనియర్ నాయకులు బుర్ర మల్లేశం గౌడ్, మండల నాయకులు రాచకొండ శ్రీదర్ రావు, సుదీర్ రావు గంప లవన్, కొర్వి అమర్, ఒగ్గు కనుకయ్య, బుర్ర కిషన్, బుర్ర వినిత్, రేవోజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.






### లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో

# ప్రత్యేక పూజలు

**ప్రజానావ, బెజ్జంకి:** మండల కేంద్రం బెజ్జంకిలోని శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు, విష్ణు సహస్ర నామాలు, పూలతో స్వామి వారి ప్రత్యేక అలంకరణ, అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు హాజరై తమ తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఇకనుంచి ఆలయంలో ప్రతి నెల స్వాతి నక్షత్రం రోజున పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, ఆలయ ప్రధాన పూజారి శేషం మధుసూదనా చారి, కమిటీ సభ్యులు దోనే శ్యామ్, గుబిరే చంద్రం, బర్ల రాజయ్య, పొట్లపల్లి ప్రభాకర్, పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



# విద్యుత్‌పై అవగాహన

**ప్రజానావ, ములుగు:** ములుగు జిల్లా జగ్గన్నపేటలో విద్యుత్ అధికారులు విద్యుత్తు పొలం బాటలో భాగంగా రైతులకు కెపాసిటర్ బిగించడం వలన కలిగే లాభాలు ఎలక్ట్రికల్ పరికరాలకు ఎర్తింగ్ పద్ధతులను అందించడం వలన రక్షణ పొందడం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఇంటిలోని విద్యుత్తు పరికరాలను తడి చేతులతోని ముట్టుకోకుండా సూచనలతో పాటు ఛార్జింగ్ పెడుతూ ఫోన్ మాట్లాడడం వలన కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ బోరు వద్ద ఆటో స్టార్టర్ల వలన కలిగే దుష్ప్రభావాలు, విద్యుత్తు సర్వీస్ వైరు నాణ్యతా ప్రామాణికత, సక్రమంగా గృహజ్యోతి వినియోగం, అనాధికార గృహ వ్యవసాయ కనెక్షన్లు క్రమబద్ధీకరించడం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సర్కిల్ డీఈఈ , ములుగు డీఈఈ, ఏడీఏ, ఏఈ ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



